క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్-11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలో నారాయణగూడ, గౌరమ్మగల్లి, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, సాయిబాబాకమాన్, సుందరయ్య పార్కు తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, నారాయణగూడ ఫీడర్ పరిధి తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మదర్ డైరీ ఫీడర్ పరిధిలో రాంనగర్ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, శాస్త్రీనగర్ ఫీడర్ పరిధిలో శాస్త్రీనగర్, మోహన్‌నగర్, జెమినికాలనీ, రాంనగర్ ఫీడర్ పరిధిలో ఎస్ఆర్టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్‌మిల్ తదితర ప్రాంతాల్లో 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రామదాసు తేజావత్‌కు సన్మానం



చిక్కడపల్లి: వీణాపాణి కళానిలయం ఆధ్వర్యంలో పౌరాణిక సినిమాల్లోని పాటలు, దృశ్యాలను రసవత్తరంగా త్యాగరాయగానసభలో ప్రదర్శించారు. బుధవారం ప్రధానంగా శ్రీకృష్ణరాయబారం దృశ్యంలో పోలీసు అధికారి రామదాసు తేజావత్ దుర్యోధనుడిగా ఆహార్యం వేషధారణ ఆకట్టుకున్నాయి. మయసభలో అవమానంతో రౌద్రనటన రంజింపజేసింది. డాక్టర్ శ్రీదేవి కృష్ణుడిగా హావభావాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని రామదాసు తేజావత్‌ను అభినయ శిరోమణి బిరుదుతో సత్కరించారు. సంస్థ కార్యదర్శి వేణుగోపాల్, అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీదేవి, గాయని వరలక్ష్మి, గాంధీలు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు కనీస వేతనాలు అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత 16 ఏళ్లుగా ఆరోగ్యమిత్రలుగా పనిచేస్తున్న సిబ్బందికి కనీసవేతనం అమలు చేయాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరియాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. సరిపడ వేతనాలు లేక ఆరోగ్యమిత్రలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించి ఆరోగ్య మిత్రలకు కనీస వేతనాలు రూ.28 వేలతో పాటు టీఏడీఏ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రి హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓకు విన్నవించినా న్యాయం జరగలేదని వాపోయారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అదనపు ఎంబీబీఎస్ సీట్లు హర్షణీయం

సికింద్రాబాద్: రాష్ట్రంలో అదనపు ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమని వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కాంపిటేటివ్ అథారిటీ కోటాలో వంద శాతం సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు శుభవార్త అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మంత్రి హరీష్‌రావుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, ముఖ్య సలహాదారులు రాయల సతీష్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

లాలాపేట: ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓయూ స్టూడెంట్స్ ఎజెండా అమలుకు ప్రభుత్వ ముందుకు రావాలన్నారు. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్, రామకృష్ణ,సుమంత్, స్వాతి తదితరులున్నారు.

పేదలకు అండగా బస్తీ దవాఖానాలు



ప్రేమ్‌నగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: పేదల వైద్యానికి బస్తీ దవాఖానాలు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. చిన్న చిన్న వైద్యానికి సైతం పేదలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా బస్తీ దవాఖానాలను వినియోగించుకోవాలని సూచించారు. వైద్యపరీక్షలు సైతం 24 గంటల్లో జరుగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో పేదప్రజలు విద్య, వైద్యం, ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నారన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, వైద్యులు హర్షశ్రీ, వైద్య సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ గైర్హాజరు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో మంత్రి తలసాని చేతుల మీదుగా ప్రారంభమైన బస్తీ దవాఖానా ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ అమృత హాజరుకాలేదు. ఈ విషయమై కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానా ప్రారంభోత్సవానికి అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రాలేదన్నారు. ఓ అధికారి తన కార్యాలయానికి వచ్చారని ఆలస్యంగా తెలిసింది. ఆ సమయంలో తాను అందుబాటులో లేకపోవడంతో పీఏకు ఆహ్వానం లేఖ ఇచ్చి వెళ్లారని ఆలస్యంగా తెలిసిందన్నారు. గతంలో కూడా బస్తీ దవాఖాన ప్రారంభోత్సవ తేదీ ఖరారైనా ఆఖరి క్షణంలో వాయిదా వేశారన్నారు. ఈ కార్యక్రమంపై సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన సందేశం రాకపోవడంతో ఇది కూడా వాయిదా పడుతుందని అనుకున్నానన్నారు. ఈ విషయాన్ని పీఏ సమాచారం ఇవ్వలేదన్నారు.

సమాచరమివ్వలేదనడం అవాస్తవం..

బస్తీ దవాఖాన ప్రారంభోత్సవానికి కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వలేదనడం పూర్తిగా అవాస్తవం. బస్తీ దవాఖానా ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ.. తమ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంతో కలిసి స్వయంగా కార్పొరేటర్ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో కార్పొరేటర్ కార్యాలయంలో లేని కారణంగా ఆమె పీఏకు లెటర్ ఇచ్చి వచ్చారు. అనంతరం నేను పర్సనల్‌గా మూడుసార్లు కార్పొరేటర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. ఆ సమయంలో పీఏ ఫోన్ లిఫ్ట్‌చేసి మేడం మీటింగ్‌లో ఉన్నారని చెప్పారు.

– జీహెచ్ఎంసీ డిప్యూటీ ఏఎంహెచ్ఓ పద్మజ

అత్యుత్తమ విమర్శకులు ఇనాక్



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్

చిక్కడపల్లి: కొలకలూరి ఇనాక్‌కు ఎన్నో పురస్కారాల అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం, అది ఆయన రచించిన విమర్శన గ్రంథానికి రావడం చిత్రమని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి శ్రీ త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా ఇనాక్ రచించిన విమర్శిని గ్రంథావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలస్యంగానైనా అవార్డు ఇచ్చిన ఇనాక్‌ను అత్యుత్తమ విమర్శకుడిగా గుర్తింపు వచ్చిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, బైసదేవదాసు, జర్నలిస్ట్ శంకరనారాయణ, జానపద సాహితీవేత్త ఆచార్య కృష్ణారెడ్డి, గీతాదేవి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పూర్తి



పనులను పరిశీలిస్తున్న రావులపాటి మోజెస్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్‌లో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ తెలిపారు. గత కొన్ని నెలలుగా రోడ్డు గుంతలమయంగా మారడంతో స్థానికులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయించారన్నారు. రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, మురళీ, విజయకృష్ణ, కె.మధు, రాజేష్, వెంకట్‌రావు, కిరణ్, వెంకటేష్ గుప్తా తదితరులున్నారు.

వ్యర్థాలను తొలగించండి

కాచిగూడ: చెత్తను తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. వర్షాలు పడుతుండటంతో చెత్త మురుగు నుంచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఈ సమస్యపై స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించిన ఆమె బుధవారం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రామదాసు, ఆర్.సంతోష్, అన్వర్, భీమ్‌రాజ్, రవియాదవ్, ఓంప్రకాష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

రోడ్డు సమస్యలను పరిష్కరించాలి



హరినగర్‌లో నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నేతలు

ముషీరాబాద్: నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం రాంనగర్ డివిజన్‌లోని దాయారమార్కెట్ నుంచి హరినగర్ చౌరస్తా వరకు రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.కల్పనాయాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రోడ్ల దుస్థితిపై అనిల్‌కుమార్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్‌హుస్సేన్, అంజియాదవ్, పాశం అనిల్, సురేందర్‌రావు, రామానందరెడ్డి, లాయక్ అలీ, మేడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు పార్టీలు కృషి చేయాలి



మాట్లాడుతున్న టీఆర్ఆర్ఎస్ నాయకులు

నల్లకుంట: అన్ని రంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో కలుపుతామని అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి (టీఆర్ఆర్ఎస్) ఆయా పార్టీలను డిమాండ్ చేసింది. బుధవారం సాయంత్రం నల్లకుంటలోని అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో టీఆర్ఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. దీనికి హాజరైన టీఆర్ఆర్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, యువజన విభాగం అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నందున అక్కడి రజకులు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా పురోగతి సాధించారని చెప్పారు. కాగా మిగిలిన 12 రాష్ట్రాల్లో రజకులు ఓబీసీ జాబితాలో ఉండటంతో అన్ని రంగాల్లో వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి రజకుల స్థితిగతులపై అసెంబ్లీలో మాట్లాడారన్నారు. ప్రస్తుతం టీపీసీసీ హోదాలో ఉన్న ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని బహిరంగ హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని గత ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. మిగతా పార్టీలు కూడా ఈ విషయాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలన్నారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ గతంలో తీసుకొచ్చిన ఆర్డినెన్స్ 56/84ను అధ్యయనం చేసి ఆ ఆర్డినెన్స్‌ను మరోసారి జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టీఆర్ఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాడ్గేబాబా దళిత సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్, టీఆర్ఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరాజు కుమార్, కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య, యూత్ పరధాన కార్యదర్శి బేగంపేట నర్సింహులు, రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణ, అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ సర్దార్ అశోక్, కొత్త సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దేవునితో సమానం

చిక్కడపల్లి: వైద్యులు దేవునితో సమానమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. బుధవారం రాత్రి లైనెస్ క్లబ్ ఆఫ్ సంస్కృతి కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. తొలుత కమలాకర సంగీత నృత్య కళాక్షేత్రం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ ధనశ్రీనాయుడు, డాక్టర్ సరోజినిరాజు, డాక్టర్ డబ్ల్యూ సంధ్యామనోహరం, డాక్టర్ పీఎస్‌మూర్తి, కేవీ కృష్ణకుమారి, నాగలక్ష్మి, లైనెస్ భారతీతమలాకర్ తదితరులున్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి జైలు

చిక్కడపల్లి: మహిళను వేధించి, దుర్భాషలాడిన ఓ వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన రమణ మహిళను వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో నిందితుడిని కోర్టులో హాజరు పరచగా.. విచారించిన న్యాయమూర్తి జైలుశిక్ష విధించారని తెలిపారు. మహిళలను వేధించిన, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణికురాలి నగదు బ్యాగు చోరీకి గురైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన తోటరావు కూమార్తె ప్రైవేట్ ఉద్యోగిని మౌనిక మంగళవారం విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తోంది. ఈ క్రమంలో రైలు సత్తెనపల్లి స్టేషన్ వద్దకు రాగానే మొబైల్ ఫోన్, ఏటీఎం డెబిట్, క్రెడిట్, ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులు ఉన్న ఆమె బ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం గుంటూరు రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ: గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, చైర్మన్ పరశురాంరెడ్డి, కోశాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డిలు కోరారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, అహ్మద్ కనకరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

అంబర్‌పేట: విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు అకాడమిక్ హైట్స్ క్రేమ్‌బిడ్జ్ పాఠశాల రీజినల్ డైరెక్టర్ రూపారెడ్డి అన్నారు. పాఠశాలలో జరిగిన విద్యార్థుల కేబినెట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల, తోటి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేబినెట్‌కు ఎన్నికైన విద్యార్థులు సమన్వయం, సమయస్ఫూర్తితో పరిష్కరించాలని సూచించారు. క్యాబినెట్‌కు ఎన్నికైన విద్యార్థులను ఆమె అభినందించారు. ప్రిన్సిపాల్ గీతాంజలి, వైస్ ప్రిన్సిపాల్ యామిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండోరా ఆత్మగౌరవ జెండా ఎగురవేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తదితరులు

ముషీరాబాద్: ప్రతి గ్రామంలో జూలై 7న దండోరా ఆత్మగౌరవ జెండాలు ఎగురవేసి మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జూలై 7వ తేదీన దండోరా ఆవిర్భావ దినోత్సవ వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ×మాదిగల ఆత్మగౌరవ ఉద్యమమే దండోరా ఉద్యమమని సమాజంలో మాదిగ అని గర్వంగా చెప్పుకునే ఆత్మగౌరవాన్ని దండోరా ఉద్యమం నింపిందన్నారు₹. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకట్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్, రాష్ట్ర యూనివర్సిటీల ప్రెసిడెంట్ జీవన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, హైదరాబాద్ అధ్యక్షుడు సురేష్, రాష్ట్ర నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పాటు సమయపాలన అవసరం



ఫెయిర్‌వెల్ పార్టీ వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు సమయపాలన ఎంతో అవసరమని అంబేడ్కర్ కళాశాలల జాయింట్ సెక్రటరీ రమణకుమార్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో పీజీ విద్యార్థుల ఫెయిర్‌వెల్ పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించి రమణకుమార్ మాట్లాడారు. క్రమశిక్షణ గల విద్య ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

అంబర్‌పేట: నాలా పూడికతీత పనులను సత్వరమే పూర్తిచేసి డివిజన్‌లో మురుగునీటి సమస్య తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బుధవారం పాముల బస్తీ, ఎరుకలబస్తీ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీజేపీ నేతలు ఉన్నారు.



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం గోల్నాక లక్ష్మీనగర్‌కు చెందిన భారతమ్మకు మంజూరైన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. పేదలకు తనవంతు అండగా ఉంటానని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

కార్మికులను శ్రమ దోపిడీ నుంచి కాపాడాలని వినతి

చిక్కడపల్లి: మిషన్‌భగీరథ కార్మికులను శ్రమ దోపిడీ నుంచి కాపాడాలని భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు రాష్ట్ర కార్మిక కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జేఏసీ నాయకులు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఎఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యంలు కార్మికకమిషనర్ అహ్మద్‌నదీమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిషన్ భగీరథకు అనేక అవార్డులు, రివార్డులు వస్తున్నాయంటే అది కార్మికుల శ్రమ ఫలితమేనన్నారు. వారి శ్రమను గురించకుండా కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్న కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కమిషనర్ అహ్మద్ నదీమ్ సానుకులంగా స్పందించారని తెలిపారు.

బీసీ డిమాండ్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

కాచిగూడ: సీఎం కేసీఆర్ బీసీల డిమాండ్లపై కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనగణనలో బీసీ కులగణనను చేపట్టడానికి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేస్తే సరిపోదని బీసీల డిమాండ్ల సాధనకోసం జాతీయ స్థాయిలో జరిగే ఉద్యమంలో సీఎం కేసీఆర్ కలిసిరావాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీబిల్లు ద్వారా 50 శాతం రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.లక్ష కోట్లు కేటాయించాలని, క్రిమిలేయర్ రద్దుపై ప్రధానితో మాట్లాడాలని ఆయన కోరారు. బీసీనేతలు భూషణ్ భాస్కర్, నల్లెల కిషోర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పాలనలో నాయకత్వ శూన్యత

ప్రొ. లింబాద్రి



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొ. లింబాద్రి

లాలాపేట: యూనివర్సిటీల్లోని అకడమిక్ పరిపాలనలో నాయకత్వ శూన్యత ఉందని, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో నాయకత్వం వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఓయూ అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. ఓయూలోని హెచ్ఆర్‌డీసీ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు నిర్వహిస్తున్న 'అకడమిక్ నాయకత్వ శిక్షణ' ముగింపు కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ. రవీందర్‌తో కలిసి ఆయన పాల్గొన్ని ప్రసంగించారు. ఆచార్యులకు ఈ తరహా నాయకత్వ శిక్షణ ఇవ్వటం రాష్ట్రంలోనే తొలిసారి అని ఆయా విభాగాలకు నాయకత్వం వహించే అధ్యాపకులకు ముక్కుసూటితనం, స్పష్టమైన అవగాహన, పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, రెడ్యానాయక్, హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొ. స్మితా, సి.పవార్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



మాట్లాడుతున్న అల్పకాలిక విస్తారక్ బాలముగన్

చిక్కడపల్లి: వచ్చే ఎన్నికల దృష్ట్యా బూత్‌స్థాయి పటిష్టతను పెంచేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపడుతున్నామని కేరళ రాష్ట్రానికి చెందిన అల్పకారిక విస్తారక్ బాలముగన్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్' కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌ల సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలమురుగన్ మాట్లాడుతూ.. వారం రోజుల పాటు గాంధీనగర్ డివిజన్‌లో ఇంటింటికీ బీజేపీ 9 ఏళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమాల నివేదికను కేంద్ర బీజేపీ కమిటీకి అందించనున్నారని వివరించారు. ఈ సందర్భంగా పావనివినయ్‌కుమార్, డాక్టర్ కె.లక్ష్మణ్ నాయకత్వంలో బీజేపీ విజయం సాధిస్తుందని దీనికి గాంధీనగర్ డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీని అందించడంలో పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారన్నారు. ఈసారి రాష్ట్రంలో తప్పక బీజేపీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, విస్తరక్ హరీష్, బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాలు, శ్రీకాంత్, ఆకుల సురేందర్, వంజరి నవీన్, ప్రకాష్‌యాదవ్, సంయుక్తరాణి, సాయికుమార్, దోనేటి సత్యం, ఆనంద్ రావు, యాదగిరి, సాయికృష్ణ, ప్రశాంత్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.